సాక్షి
శ్రీకాకుళం

శనివారం । 30 । ఆగస్టు । 2025



నిమజ్జనం.. జరభద్రం

వినాయక మండపాలు భారీగా ఏర్పాటు చేశారు. నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించడం అత్యవసరం.

- 8లో



బస్సుల్లేవు.. రైళ్లు రావు

పలు రైళ్లు ఆలస్యం కావడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. కాంప్లెక్స్‌లోనూ రద్దీ కనిపించింది.

- 8లో

ఐదు బార్లకే డ్రా నేడు

శ్రీకాకుళం క్రైమ్ : కొత్త బార్ పాలసీలో భాగంగా జిల్లాలో ఐదు బార్లకు లాటరీ పద్ధతిలో లైసెన్సు పొందేందుకు శనివారం డ్రా తీయనున్నట్లు ఆ విభాగపు డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి వెల్లడించారు. మొత్తంగా 19 బార్లు కేటాయించామని ఇందుకు గాను 22 దరఖాస్తులే చేరాయన్నారు. ఈ మేరకు శ్రీకాకుళం కార్పొరేషన్‌లో ఓపెన్ కేటగిరీలో 3 బార్లు అర్హత సాధించగా గీతకులాల వారికి కేటాయించిన రెండు బార్లు కూడా డ్రా తీసేందుకు అర్హత సాధించాయన్నారు.

న్యూస్‌రీల్

రైల్వే గేటు మూసివేత నేడు

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వే స్టేషన్ పరిధి ఊసవానిపేట రైల్వే గేటు శనివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మూసి వేయనున్నట్లు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉర్లాం–శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ల మధ్య ట్రాక్ మరమ్మతులు పనులు నిర్వహిస్తున్న సందర్భంగా ఈ గేటు మూసి వేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉండే నరసన్నపేట రోడ్డులో ఈ గేటు ఉండడంతో ముందస్తుగా సమాచారం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు సహకరించి వేరే రహదారుల గుండా ప్రయాణించాలని ఆయన కోరారు.

130 మంది సర్టిఫికెట్ల పరిశీలన



ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాకుళం: డీఎస్సీ నియామక ప్రక్రియలో శుక్రవారం 130 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను అధికారులు పరిశీలించారు. తొలి రోజున 403 మంది అభ్యర్థుల పత్రాలు పరిశీలించిన విషయం పాఠకులకు తెలిసిందే. మిగిలిన 140 మందిలో 130 మందికి మాత్రమే కాల్ లెటర్స్ రావడంతో వారు ధ్రువపత్రాలు పరిశీలనకు హాజరయ్యారు. ఈ 130 మందిలో ఏడుగురికి పూర్తిస్థాయిలో ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో వాటిని తీసుకొని శనివారం ఉదయం 10 గంటల్లోగా రావాలని అధికారులు సూచించారు. మిగిలిన 126 మందిలో ఇద్దరు ఉద్యోగం చేపట్టేందుకు అయిష్టతను లిఖితపూర్వకంగా తెలియజేశారు. జిల్లా నుంచి పీజీటీ, టీజీటీ, ప్రిన్సిపాల్ వంటి జోనల్ స్థాయి పోస్టులకు అర్హత సాధించిన వారికి విశాఖపట్నంలో ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరుగుతోంది. జిల్లా నుంచి ఈ పోస్టులకు ఎంతమంది ఎంపికయ్యారు అన్నది కూడా అధికారులు సైతం చెప్పలేకపోతున్నారు. అయితే మొత్తం 543 మందికి కాల్ లెటర్స్ రావాల్సి ఉండగా, ఇప్పటివరకు 533 మందికి మాత్రమే పత్రాల పరిశీలనలకు పిలుపు వచ్చింది. మిగిలిన వారికి ఎందుకు రాలేదనే సందేహం వ్యక్తమవుతోంది. జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం శనివారం ఉదయంలోగా మిగిలిన పదిమందికి మెసేజీలు వస్తాయని చెబుతున్నారు.

'వైఎస్సార్‌ను స్మరించుకుందాం'



నరసన్నపేట: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సెప్టెంబర్ 2వ తేదీన పార్టీ శ్రేణులు ఊరూరా నిర్వహించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపు నిచ్చారు. వైఎస్సార్ విగ్రహాల వద్ద ఘనంగా నివాళులర్పించాలన్నారు. పార్టీ శ్రేణులు పూర్తి స్థాయిలో పాల్గొనాలని కోరారు.

గిడుగు స్వగ్రామంలో ఘనంగా జయంతి వేడుకలు



గిడుగు విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటిస్తున్న దృశ్యం

నరుబుజ్జిలి: వ్యావహారిక భాషా పితామహులు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలు ఆయన స్వగ్రామం అగ్రహారం గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, ఆమదాలవలస మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బెవర కృష్ణవేణి, ఎంఈఓ డి.బాలరాజు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. వ్యవహారిక భాషా అమలులో అంతర్జాతీయ స్థాయిలో గిడుగు ప్రఖ్యాతి గడించారని అన్నారు.

'మా ఊరి పేరు మార్చండి'

మెళియాపుట్టి: తమ ఊరి పేరే తమకు సమస్యగా మారిందని పడ్డ గ్రామ పంచాయితీ పరిధిలోని సానిపాలెం గ్రామానికి చెందిన ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ పాపారావుకు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. గ్రామం పేరు వల్ల అవమానాలు ఎదురవుతున్నాయని, గ్రామానికి రామయ్య పాలెం అని పేరు మార్చాలని కోరారు.



తహసీల్దార్ పాపారావుకు వినతి పత్రం అందిస్తున్న సానిపాలెం గ్రామస్తులు



వాహనం వెనుక వేలాడుతూ బడికి వెళ్లేంత ఖర్మ పిల్లాడికి ఏం పట్టింది..? ఊపిరి తీసుకోవడానికి కూడా వీల్లేకుండా కిక్కిరిసి కూర్చోవాల్సిన అవస్థ ఏముంది..? కండీషన్‌లో ఉందో లేదో తెలీని బండిలో విద్యార్థిని పంపించేంత అజాగ్రత్త ఎందుకు..? ప్రతి ఉదయం చాలా మంది విద్యార్థులు ఈ అవస్థలు పడుతూనే బడికి వెళ్తున్నారు. దురదృష్టవశాత్తు ఏ చిన్న ప్రమాదం జరిగినా బతుకంతా బాధ పడాల్సి వస్తుంది. అలాంటి పరిస్థితి రాకముందే తల్లిదండ్రులు మేల్కోవాలని అధికారులు సూచిస్తున్నారు. పిల్లలను బడికి పంపే వాహనాలను ఒకటికి రెండు సార్లు చూసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదంలో పసి ప్రాణాలు

- ప్రతి నిత్యం వాహనాల్లో ప్రమాదకరంగా విద్యార్థుల ప్రయాణాలు
- తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలని అధికారుల సూచనలు
- పిల్లలను తీసుకెళ్లే వాహనాలు కచ్చితంగా నిబంధనలు పాటించాల్సిందేనన్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్:

తల్లిదండ్రుల ఏమరపాటు, కొందరు డ్రైవర్ల అత్యాశ, అధికారుల అలసత్వం కలగలిపి.. ప్రతి ఉదయం పసి ప్రాణాలకు పరీక్ష ఎదురవుతోంది. భుజాన బండెడు బరువు మోసుకుంటూ బడికి వెళ్లడం కోసం వాహనం ఎక్కే విద్యార్థులకు సురక్షిత ప్రయాణం గగనమైపోతోంది. అయితే వ్యానులో కిక్కిరిసి వెళ్లడమో, లేదంటే ఆటో వెనుక కూర్చుని వెళ్లడమో లేదంటే స్కూలు బస్సులో ఇనుప జాలీల వెనుక నుంచి గాలి తగలని పరిస్థితుల్లో దీనంగా బయటకు చూస్తూ ప్రయాణించడమో జరుగుతోంది.

వేగంగా పిల్లలను స్కూల్‌లో దింపి వేరే సర్వీసుకు వెళ్లిపోవాలనే ఆలోచన ప్రైవేటు వాహనాలకు ఉంటుంది. నిబంధనలను మీరి స్పీడ్ పెంచడం, రాంగ్‌రూట్‌ల్లో ఎదురుగా వస్తున్న వాహనాలను పట్టించుకోక పరిగెత్తించడంతో అప్పటికే పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకున్న వాహనాలు ప్రమాదాలకు గురై పసివారు బలైపోతున్నారు. తాజాగా శుక్రవారం ఉదయం ఎచ్చెర్ల మండలం చిలకపాలెంకు చెందిన ఏడో తరగతి విద్యార్థి ఆటో ప్రమాదంలో మృతిచెందాడు.

ప్రైవేటు వాహనాలే గతి..

జిల్లా కేంద్రాన్ని ఆనుకొని ఉన్న అనేక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులను చేరవేసేందుకు ప్రైవేటు వాహనాలే దిక్కు. ముఖ్యంగా ఒక కిలోమీటరు నుంచి ఐదు కిలోమీటర్ల లోపు ఉండే స్కూళ్లకు బస్సు సదుపాయం లేక తల్లిదండ్రులు కొందరు ఆటోవాలాలకు, వ్యాన్లకు నెలకు ఇంతిస్తామని సంప్రదించి పెట్టుకుంటున్నారు. ఆటోకు పర్మిట్, ఇన్సూరెన్సు, ఫిట్‌నెస్ పత్రాలు ఉండడంతో పాటు ఆరుగురికి మించి విద్యార్థులు ప్రయాణించకూడదని నిబంధనలున్నా ఎవరూ అవి పాటించడం లేదు. వ్యాన్ల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. తల్లిదండ్రులు కూడా తక్కువ మంది విద్యార్థులను తీసుకెళ్లే ఆటోల్లోనే పంపించాలని, అదీ నిర్ణీత సమయంలోగా పంపించాలని పోలీసులు సూచిస్తున్నారు. అంతే కాక ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలని హెచ్చరిస్తున్నారు.

పరిమితికి మించి ప్రయాణం నేరం

విద్యార్థులను తీసుకెళ్లే ఆటోలను ఎస్పీ ఆదేశాలతో స్పెషల్ డ్రైవ్ వేసి మరీ పట్టుకుంటున్నాం. పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటోలపై ఈ ఏడాది ఇప్పటివరకు 39 కేసులు నమోదు చేశాం. ఒక్క జూలైలోనే 18 నమోదయ్యాయి. ఇక లేబర్‌ను తీసుకెళ్లే ఆటోలపైనా నిబంధనలు మీరితే చర్యలు తీసుకుంటున్నాం. దాదాపు మూడు వేలకు పైగా ఆటోలున్న మన జిల్లాలో ఎప్పటికప్పుడు డ్రైవర్లకు రోడ్డు నియమ నిబంధనలపై కౌన్సిలింగ్ చేస్తున్నాం.

– నాగరాజు, సీఐ, ట్రాఫిక్

● ప్రమాదం.. ఈ ప్రయాణం







జిల్లా కేంద్రంలో ఇలాంటి ప్రయాణాలు నిత్యకృత్యంగా మారిపోయాయి. ప్రతి నిత్యం విద్యార్థులకు విషమ పరీక్షలు ఎదురవుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

బతుకు తల్లకిందులు

- ఆటో బోల్తా పడి విద్యార్థి మృతి





ప్రమాదం జరిగిన ప్రాంతం, మృతి చెందిన కుప్పిలి మనోజ్ (ఫైల్)

ఎచ్చెర్ల:

అమ్మను ఆట పట్టిస్తూ సందడిగా గడిపే వయసది. అక్కతో హాయిగా కబుర్లు చెబుతూ ఆనందంగా ఉండే ప్రాయమది. కింద పడి దెబ్బ తగిలితేనే విలవిలలాడిపోయే శరీరమది. కానీ నడిరోడ్డుపై తిరగబడిన ఆటో.. ఆ పిల్లాడి బతుకును తల్లకిందులు చేసేసింది. ఆ తల్లికి కొడుకును దూరం చేసింది. తమ్ముడి యాతనను కళ్లారా చూసిన అక్కకు జీవితానికి సరిపడా వేదన మిగిల్చింది. దాదాపు పది మంది ప్రయాణికులు ఉన్న ఆటోలో అంతా సురక్షితంగా బయటపడితే.. అతడు మాత్రమే చావుకు బలయ్యాడు. చిలకపాలెం జంక్షన్ సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిలకపాలెం గ్రామానికి చెందిన కుప్పిలి మనోజ్ (12) అనే విద్యార్థి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మనోజ్‌తో పాటు మరో ఆరుగురు విద్యార్థులు, ఇద్దరు టీచర్లు అల్లినగరం గ్రామంలోని ఉన్నత పాఠశాలకు ఆటోలో వస్తుండగా చిలకపాలెం జంక్షన్ దాటాక హైవేపై బండి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది.

ప్రమాదంలో మనోజ్ ఆటో కింద ఉండిపోవడంతో బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి అతడిని శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ వైద్యులు మనోజ్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మనోజ్‌తో పాటుగా ఆటోలో ఉన్న విద్యార్థులు, టీచర్లు చిన్న గాయాలతో బయటపడ్డారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తీసుకెళ్లారు.

అక్క కళ్లెదుటే..

మనోజ్ అక్క దర్శినీ ప్రియ కూడా అదే ఆటోలో ఉంది. తమ్ముడి వేదనను కళ్లారా చూసిన ఆమె ఏం చేయాలో తెలీక నిస్సహాయంగా దిక్కుతోచని స్థితిలో ఏడుస్తుంటే చూసిన వారి కళ్లు చెమ్మగిల్లాయి. మనోజ్ తండ్రి కుప్పిలి ప్రకాష్ చిలకపాలెంలోని మునిపేట వద్ద కార్పెంటరీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇద్దరు పిల్లలు రోజూ ఆటోలోనే స్కూల్‌కు వెళ్లేవారు. ఇప్పుడు ఆ ప్రయాణమే మనోజ్ ప్రాణం తీయడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. మనోజ్ అల్లినగరం ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. అక్క 8వ తరగతి చదువుతోంది. విద్యార్థి మృతి చెందడంతో శుక్రవారం బడికి సెలవు ప్రకటించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పార్థసారధి, ఉపాధ్యాయులు, విద్యార్థులు మనోజ్‌కు నివాళులర్పించారు. ఘటన జరిగిన చోట రద్దీగా ఉంటుందని, ఓ కానిస్టేబుల్‌ను పెట్టాలని యూటీఎఫ్ నాయకులు ఎస్‌ఐ సందీప్‌ను కోరగా ఆయన అంగీకరించారు.



మనోజ్‌కు నివాళులు అర్పిస్తున్న అల్లినగరం ఉపాధ్యాయులు, విద్యార్థులు

గంజాయి అక్రమ రవాణా కేసులో పదేళ్ల జైలు శిక్ష

వజ్రపుకొత్తూరు రూరల్: గత ఏడాది ఒడిశాకు చెందిన శంకరన్ మిశ్రా, సరోజ్ కుమార్ సాహో 42 కిలోల గంజాయిని అక్రమ రవాణా చేస్తూ పలాస రైల్వే స్టేషన్‌లో పట్టుబడ్డారు. ఈ మేరకు జీఆర్పీ పోలీసులు వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులపై నేరం రుజువు కావడంతో శుక్రవారం ముద్దాయిలకు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానాను శ్రీకాకుళం ఏడీజే కోర్టు మేజిస్ట్రేట్ విధించింది.

సిక్కోలులో బార్బరిక్ యూనిట్ సందడి



థియేటర్‌లో మాట్లాడుతున్న చిత్ర యూనిట్

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళంలోని కిన్నెర థియేటర్‌లో ప్రదర్శిస్తున్న 'బార్బరిక్' చిత్ర యూనిట్ శుక్రవారం శ్రీకాకుళంలో పర్యటించింది. చిత్రంలో ప్రధాన పాత్ర పోషించిన సీనియర్ నటుడు సత్యరాజ్(కట్టప్ప)తో పాటు చిత్ర నటులు సత్యం రాజేష్ తదితరులు విచ్చేసి ప్రేక్షకులతో ముచ్చటించారు. చిత్ర దర్శకులు మోహన్ శ్రీవత్స మాట్లాడుతూ తనది శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం సుసరాం గ్రామమని, చిన్నప్పటి నుంచి తనకు సినిమాలంటే ఎంతో ఇష్టమని, ఆ ఇష్టంతోనే దర్శకునిగా మారి బార్బరిక్ చిత్రాన్ని తీశానని తెలిపాడు. సత్యరాజ్(కట్టప్ప) మాట్లాడుతూ శ్రీకాకుళం రావడం ఇదే తొలిసారని, ఇక్కడి ప్రేక్షకులు ఎంతో మంచివారని, సినిమా బాగుంటే ఎంతగానో ఆదరిస్తారన్నారు. నటుడు సత్యం రాజేష్ మాట్లాడుతూ 'ఊర్లో అందరూ మంచిగున్నార్రా' అంటూ ప్రేక్షకులను అడిగేసరికి ప్రేక్షకులంతా కేరింతలు, ఈలలు వేశారు. ఇక్కడి ప్రేక్షకుల ఆదరాభిమానాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో చిత్ర యూనిట్ ప్రతినిధులు సురేష్, కిన్నెర థియేటర్ మేనేజర్ వరప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ జయరాం, డిస్ట్రిబ్యూటర్ తేజ తదితరులు ఉన్నారు.

సర్కారు వైఖరి.. మూడు బడులకు ఉరి



మూతపడిన వీఎన్‌పురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

- ప్రభుత్వ విధానాలతో మూతపడిన మూడు పాఠశాలలు
- సొంత ఊరిలో విద్యకు నోచుకోని కౌశల్యాపురం, మహదేవిపురం, నేరడి గ్రామాల పిల్లలు

కొత్తూరు: కూటమి ప్రభుత్వ వైఖరి ప్రభుత్వ బడులకు ఉరిగా మారుతోంది. విద్యా శాఖలో ఈ ఏడాది తీసుకువచ్చిన నూతన విద్యావిధానం విద్యార్థులకు శాపంగా మారుతోంది. చిన్నారులు ఉన్న ఊరిలో పాఠశాలలో చదువుకునే భాగ్యానికి దూరమవుతున్నారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులను మరో బడికి పంపించేయడంతో కొత్తూరు మండలంలోని కౌశల్యాపురం, మహదేవిపురం, నేరడి గ్రామాలకు చెందిన మూడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. ఈ ఏడాది ఈ పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా జాయిన్ కాకపోవడంతో టీచర్లను మరో పాఠశాలకు నియమించారు.

ఈ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులను సమీపంలో ఉన్న మోడల్ ప్రైమరీ పాఠశాలకు పంపించారు. దీంతో ఈ మూడు పాఠశాలల్లో రెండో తరగతి చదువుతున్న ఒక్కో విద్యార్థి మిగిలాడు. ఒక విద్యార్థి కోసం ఒక టీచర్ పని చేస్తున్న తరుణంలో ఎక్కువ మంది పిల్లలు లేరన్న కారణంతో ఉన్న పిల్లలను తల్లిదండ్రులు వేరే బడికి పంపించారు. దీంతో విద్యార్థులు లేక మూడు పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారులు మూసివేశారు. ఊరిలోని బడిలో పిల్లలను చదివించలేకపోతున్నామని ఆయా గ్రామాల ప్రజలు బాధ పడుతున్నారు.



మూతపడిన నేరడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

ఐదు తరగతులు నిర్వహించాలి



ఒకటి నుంచి ఐదు తరగతులు ఒకే పాఠశాలలో నిర్వహించినప్పుడే పిల్లలంతా ఒకే పాఠశాలలో చదువుతారు. మూడు నుంచి ఐదు తరగతుల వరకు చదువుతున్న పిల్లలను మరో పాఠశాలలో చేర్పించడం వల్ల మిగతా వారు ఉండడం లేదు.

– గూనాపు రాజు, విద్యార్థి తల్లి, నేరడి, కొత్తూరు

గ్రామాల్లో పిల్లలు లేరు

మూత పడిన మూడు పాఠశాలల గ్రామాల్లో బడి ఈడు పిల్లలు లేరు. దీంతో ఈ ఏడాది పాఠశాలల్లో విద్యార్థులు చేరకపోవడంతో బడులు మూతపడ్డాయి. రెండో తరగతిలో ఉన్న ఒక్క విద్యార్థిని తల్లిదండ్రులు ఇతర పాఠశాలకు తీసుకువెళ్లడంతో పాఠశాలలను తాత్కాలికంగా మూసివేశాం.

– ఎస్.శ్రీనివాసరావు ఎంఈఓ–2, కొత్తూరు మండలం

సౌకర్యాలు లేవు



మా గ్రామంలో ఉన్న పాఠశాలలో సౌకర్యాలు లేవు. మరుగుదొడ్లు సక్రమంగా పని చేయడం లేదు. మా పిల్లాడు ఒక్కడు మాత్రమే స్కూల్‌లో ఉంటే మానసిక వికాసం సరిగా ఉండదు. అందుకే సమీపంలోని కురిగాం పాఠశాలలో చేర్పించాము.

– ఒట్టికొట్టు స్వాతి, విద్యార్థి తల్లి, మహదేవి పురం కొత్తూరు మండలం



కంచిలి: చిన్న శ్రీరాంపురంలో వినాయకుడి విగ్రహం



ఇచ్ఛాపురం రూరల్: భవానీపురంలో అడవి సెట్‌లో వినాయకుడు

ఆ రూపం.. అపురూపం

అపురూపంగా మండపాలు... అపూర్వ తీరుల్లో అవతారాలు. వినాయక చవితి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా విభిన్న రూపాల్లో గణపతి విగ్రహాలను ప్రతిష్టించారు. మండపాలను విశిష్ట రీతుల్లో అలంకరించి ఆకట్టుకున్నారు.


–సాక్షి నెట్‌వర్క్



వజ్రపుకొత్తూరు: పూండిలో పూజలందుకుంటున్న వినాయకుడు



శ్రీకాకుళం శ్రీశయన వీధిలో..



శ్రీకాకుళం పెద్దబరాటం వీధిలో..

క్లుప్తంగా

దీర్ఘాశిలో చైన్‌స్నాచింగ్

పోలాకి: దీర్ఘాశి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో దొంగలు హల్‌చల్ సృష్టించారు. మెండ గడ్డెమ్మ(63) అనే వృద్ధురాలు పశువులకు దాణా పెడుతుండగా వెనక నుంచి వచ్చిన అగంతకుడు బంగారు తాడు (సుమారు పావు తక్కువ మూడు తులాలు) లాక్కొని అక్కడే బైక్‌పై ఉన్న ఇంకో వ్యక్తి సహాయంతో పరారయ్యారు. తాడు లాగే సమయంలో తన నోటిని గట్టిగా మూసివేసినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఎస్ఐ రంజిత్ నేతృత్వంలో చైన్‌స్నాచర్స్ కోసం వేట ముమ్మరం చేశారు. కొందరు అనుమానితులను గుర్తించి విచారిస్తున్నట్లు సమాచారం. నిత్యం రద్దీగా వుండే పోలాకి–నరసన్నపేట రహదారిలో చైన్‌స్నాచర్‌లు పరారైనట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది.

కార్మికులకు అండగా..



కార్మికులకు డీడీ అందిస్తున్న డీసీఎల్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రమదోపిడీకి గురవుతున్న కార్మికులకు కార్మికశాఖ ఉప కార్మిక కమిషనర్ డి.దినేష్‌కుమార్ అండగా నిలిచారు. ప్రత్యేక తనిఖీలు నిర్వహించి శుక్రవారం కార్మికులకు రూ.45514 వేతనాన్ని యాజమాన్యాల నుంచి వసూలు చేసి డి.డి.రూపంలో తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా డీసీఎల్ మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ ప్రకారం ఆన్‌లైన్‌లో తనిఖీ నిర్వహించాలని వచ్చిన దరఖాస్తుల్ని పరిశీలించగా.. అందులో నలుగురు కార్మికుల వేతనాల్లో తేడాల్ని గమనించామన్నారు. సంబంధిత యజమానుల వద్ద నుంచి తేడా వేతనాన్ని రికవరీ చేసి కార్మికులకు అందించామని చెప్పారు. దీంతో కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: పెద్దరోకళ్లపల్లి పంచాయతీ రామనగరం గ్రామానికి చెందిన బొడ్డు రామన్న (37) అనే వ్యక్తి చెరువులో పడి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్న తన పొలంలో ఎరువులు వేసిన తర్వాత గ్రామ సమీపంలోని చెరువులో స్నానానికి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో మునిగిపోయాడు. కొద్దిసేపటి తర్వాత స్థానికులు గుర్తించి చెరువులో తేలుతున్న రామన్నను బయటకు తీసి టెక్కలి జిల్లాఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రామన్నకు భార్య లత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశారు.

మా సొమ్ము ఎప్పుడు చెల్లిస్తారు?



పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడుతున్న ఖాతాదారులు

ఇచ్ఛాపురం: తాము కష్టపడి సంపాదించుకున్న సొమ్మును తిరిగి చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన తప్పదని ఇచ్ఛాపురం పోస్టాఫీసు వద్ద ఖాతాదారులు స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం పోస్టాఫీసును పరిశీలించేందుకు వచ్చిన పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌ను కలిసి తమ గోడు వినిపించారు. స్కామ్ జరిగి నెలరోజులైనా పోస్టల్ సిబ్బంది పట్టించుకోకపోవడం తగదని ఖాతాదారులు బాలరాజు, సీహెచ్ లోహిదాస్, శ్రీను తదితరులు వాపోయారు.

యువకుడిపై పోక్సో కేసు

శ్రీకాకుళం క్రైమ్ : బాలికను మోసగించిన యువకుడిపై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేశామని శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ పి.ఈశ్వరరావు తెలిపారు. కృష్ణా జిల్లా విజయవాడ సమీపంలోని విద్యాధరిపురం ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ కుమార్తె ఇంటర్మీడియట్ సగంలో ఆపేసింది. శ్రీకాకుళం నగరంలోని బాకెర్‌సాహెబ్‌పేటలో తన అమ్మమ్మ ఇంటికి తరచూ వస్తుండేది. ఈ క్రమంలో ఈ ఏడాది మార్చిలో నగరానికి వచ్చిన బాలిక తన ఫోన్ పనిచేయకపోవడంతో దీపామహల్ సమీపంలో సెల్‌ఫోన్ షాపులో ఇచ్చింది. నిర్వాహకుడు వడ్డి శ్యామ్‌సుందరరావుతో పరిచయం ఏర్పడటంతో గర్భం దాల్చింది. దీంతో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

నిమజ్జనం.. జరభద్రం!

- మొదలైన గణనాథుని అనుపోత్సవం
- చెరువులు, గెడ్డలు, సముద్రం వద్ద జాగ్రత్తలు తప్పనిసరి
- మద్యానికి దూరంగా ఉండాలంటున్న అధికారులు



ఇటువంటి చెరువుల వద్ద నిమజ్జనాల్లో జాగ్రత్తలు అవసరం

టెక్కలి : వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలు మొదలయ్యాయి. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వినాయక చవితి ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన అనుపోత్సవంలో పాల్గొనేందుకు యువకులు పోటీపడుతుంటారు. ఈ సమయంలో కొందరు అత్యుత్సాహంతో వ్యవహరిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. నిమజ్జనం సమయంలో మద్యం సేవించి చెరువుల్లో, కాలువల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకునే పరిస్థితి తెచ్చుకోవద్దని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..

ఇటీవల కురుస్తున్న వర్షాలకు దాదాపు అన్ని చెరువులు, సాగు నీటి కాలువలు నీటితో కళకళలాడుతున్నాయి. ఉపాధి పనులు జరగడంతో చాలావరకు లోతుగా ఉన్నాయి. అది గమనించకుండా రాత్రి సమయాల్లో నిమజ్జనాల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా సముద్రతీరంలో నిమజ్జనాలు మరింత ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. చిన్నారులను చెరువులు, సాగు నీటి కాలువలు, సముద్రతీరాల వద్దకు తీసుకువెళ్లకపోవడం ఉత్తమం. గతంలో జరిగిన కొన్ని సంఘటనలు దృష్టిలో ఉంచుకుని వినాయక నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలని యువకులకు అధికారులు సూచిస్తున్నారు. ఈ విషయంలో ఆయా ఉత్సవ కమిటీ సభ్యులే భాధ్యత వహించాలని ఆదేశాలు చేస్తున్నారు. నిమజ్జనాల్లో కొన్ని రకాల జాగ్రత్త చర్యలు, ఆంక్షలపై టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు, సీఐ విజయకుమార్ తదితరులు ఉత్సవ కమిటీ సభ్యులతో ఇటీవల సమావేశం నిర్వహించి సూచనలు అందజేశారు.



అలా చేస్తే చర్యలు..

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మద్యం సేవించి తగాదాలకు పాల్పడినా, నిమజ్జనాల సమయంలో మద్యం సేవించినా చర్యలు చేపడతాం. మద్యానికి దూరంగా ఉంటూ నిమజ్జనాలు చేస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ఈ విషయంలో నిబంధనలు అతిక్రమిస్తే ఉత్సవ కమిటీ సభ్యులే బాధ్యులవుతారు.

– డి.లక్ష్మణరావు, డీఎస్పీ, టెక్కలి

జాగ్రత్తలు తప్పనిసరి..

- పోలీసులు సూచించిన మార్గంలోనే నిమజ్జన ఊరేగింపు చేయాలి. విగ్రహాన్ని తరలించే వాహనాల సమాచారం ముందస్తుగా అందజేయాలి. డీజే కు అనుమతి తీసుకోవాలి.
- నిమజ్జనం సమయంలో విద్యుత్ తీగల ప్రభావం లేకుండా చూసుకోవాలి.
- నిమజ్జన ఊరేగింపులో వేషధారణలపై ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- మద్యం సేవించి నిమజ్జనాల్లో పాల్గొనేవారిపై కఠినమైన చర్యలు చేపట్టే విధంగా ఆదేశాలు ఉన్నాయి
- పోలీసులు గుర్తించిన సురక్షితమైన ప్రదేశాల్లో మాత్రమే విగ్రహాలను నిమజ్జనం చేయాలి.
- నిమజ్జనాల్లో చిన్న పిల్లలు లేకుండా చూసుకోవాలి.

రసాభాసగా మున్సిపల్ సమావేశం

- అధికారుల వైఖరికి నిరసనగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల వాకౌట్



వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను లోపలికి పిలుస్తున్న కమిషనర్ రామారావు

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపల్ సాధారణ సమావేశం రసాభాసగా మారింది. పోలీసు పహారా మధ్య మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఈ సమావేశం నుంచి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు వాకౌట్ చేశారు. గత సమావేశంలో తెలిపిన అంశాలపై తగిన వివరణ ఇవ్వకుండా ఎలా ఈ సమావేశమవుతారని మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, కౌన్సిలర్లు దుర్గాప్రసాద్ పండా, బెల్లాల శ్రీనివాసరావు, పప్పల ప్రసాదరెడ్డి, పిచ్చుక అజయ్, కర్రి మాధవరావు, సవర సోమేశ్వరరావు, బోర చంద్రకళ, దున్న నిర్మల, శార్వాన గీతరవి, దువ్వాడ సత్యవతి, అంబటి మాధురి, పోతనపల్లి ఉమాకుమారి, బల్ల రేవతి, కోఆప్సన్ సభ్యుడు బమ్మిడి సంతోస్‌కుమార్ తదితరులు ప్రశ్నించారు. తగిన సమాధానం రాకపోవడంతో వారంతా పోడియం ముందు బైఠాయించి నిరసన తెలియజేశారు. అయినప్పటికీ కమిషనర్ ఎస్.రామారావు నుంచి తగిన సమాధానం రాకపోవడంతో బయటకు వెళ్లి బైఠాయించారు. అప్పటికే సభలో 8మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. సమావేశానికి ముందుగా ఈ విషయం తెలియక ముగ్గురు వైఎస్సార్ సీపీ సభ్యులు శిష్టు బృందావతి, జోగి సతీస్‌కుమార్, బోనెల చంద్రమ్మలు రిజిస్టరు పుస్తకంపై సంతకాలు చేశారు.

దీంతో మొత్తం 11 మంది సభ్యులు ఉన్నారని కోరం సరిపోయిందని కమిషనరు సమావేశం తూతూమంత్రంగా ముగించేశారు. 37 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించినట్టు తీర్మానాలు చేసుకున్నారు. వార్డుల్లో తమకు సంబంధం లేకుండా పనులు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

జీడి రైతుల అభివృద్ధికి భరోసా: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జీడిపప్పు రైతుల ఆర్థికాభివృద్ధికి సహకరిస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జీడి రైతులకు భరోసా ఇచ్చారు. పలాస ప్రాంతం జీడిపప్పునకు కేంద్ర ప్రభుత్వం వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ పథకం కింద ప్రత్యేక గుర్తింపు ఇచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కలెక్టర్ అధ్యక్షతన జీడి రైతులు, బయ్యర్స్, ప్రాసెసింగ్ యూనిట్ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీడిపప్పు రైతులకు సరైన ఆదాయం రాబట్టే విధంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని, జిల్లాలోని బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా రైతులకు సులభ రుణ సదుపాయాలు కలిప్పించాలని, డీఆర్‌డీఏ ద్వారా సబ్సిడీలు, ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హార్టికల్చర్ శాఖ ద్వారా ఎరువులు, విత్తనాలు సమయానికి అందేలా పర్యవేక్షణ ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రాసెసింగ్ యూనిట్లకు విద్యుత్ శాఖతో ఉన్న సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించేందుకు ఆదేశాలు ఇచ్చారు. ముఖ్యంగా 20 కిలోవాట్స్ లోడ్ కంటే తక్కువ ఉన్న యూనిట్లకు ట్రాన్స్‌ఫార్మర్ అవసరం లేకుండా సౌకర్యం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జీడిపప్పు బైప్రొడక్ట్స్‌ను ఉపయోగించి రైతులకు అదనపు ఆదాయం వచ్చే అవకాశాలను కూడా ఈ సమావేశంలో చర్చించారు. రైతులు ఎఫ్‌పీఓగా ఏర్పడి ముందుకు వస్తే 75% సబ్సిడీ కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో ఉద్యాన శాఖ అధికారి ఆర్‌వీవీ ప్రసాద్, డీఆర్డీఏ పిడి పి.కిరణ్ కుమార్, ఇండస్ట్రీస్ జీఎం జీఎం.శ్రీధర్, ఏపీఎంఐపీ పిడి శ్రీనివాసరావు, ఎల్‌డీఎం ఎం.సూర్య కిరణ్, శ్రామిక శాఖ ఉప కమిషనర్ కె.దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వర్సిటీ అధికారులు

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ క్యాంపస్‌తో పాటు అనుబంధ కళాశాలల్లో పరిశోధన చేసేందుకుగాను పీహెచ్‌డీ సీట్లు భర్తీకి శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. బయోటెక్నాలజీ, సోషల్‌వర్క్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కౌన్సెలింగ్ జరిపి సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించారు. వర్సిటీ అకడమిక్ అఫైర్స్ డీన్ డాక్టర్ కె.స్వప్నవాహినీ పర్యవేక్షణలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో ఈ కౌన్సెలింగ్ జరిగింది. రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, డాక్టర్ ఎం.అనూరాధ పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

శ్రీకాకుళం పాతబస్టాండ్: మధ్యవర్తిత్వం ద్వారా కేసులను సులభంగా రాజీ చేసుకోవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఎక్కువ కేసులు కోర్టుల్లో కాకుండా మధ్యవర్తిత్వం ద్వారానే పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు మధ్యవర్తిత్వ న్యాయవాదులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు కోచ్‌గా అర్జున్‌రావు రెడ్డి



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ బాస్కెట్‌బాల్ కోచ్ గాలి అర్జున్‌రావు రెడ్డి జాతీయ పోటీలకు కోచ్‌గా నియమితులయ్యారు. పంజాబ్‌లో సెప్టెంబర్ 2 నుంచి జరగనున్న 75వ ఆలిండియా జూనియర్స్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్–2025 పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టుకు కోచ్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు శాప్ నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. ఈయన నియామకం పట్ల శ్రీకాకుళం జిల్లా బాస్కెట్బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేశారు.

7న సంపూర్ణ చంద్రగ్రహణం

అరసవల్లి: సెప్టెంబర్ 7వ తేదీన భాద్రపద శుద్ధ పౌర్ణమి ఆదివారం రాత్రి సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ప్రసిద్ధ సూర్యక్షేత్రం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయం మధ్యాహ్నం 2 గంటల నుంచి మూసివేస్తున్నట్లుగా ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఈఓ కెఎన్‌వీడీవీ ప్రసాద్‌లు తెలియజేశారు. ఆగమశాస్త్ర నిబంధనల ప్రకారం 7వ తేదీ రాత్రి వేళలో గ్రహణ సమయం కావడంతో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సర్వదర్శనాలకు అవకాశమిచ్చి.. అనంతరం భోగసమయం దాటాక అంటే మధ్యాహ్నం 2 గంటలకే ఆలయ ప్రధాన ద్వారాలు మూసివేయనున్నామని వారు వివరించారు. గ్రహణానంతరం ఆలయంలో సంప్రోక్షణ, శుద్ధి కార్యక్రమాల అనంతరం మరుసటి రోజు అనగా 8వ తేదీ సోమవారం ఉదయం 7.30 గంటల నుంచి సర్వదర్శనాలకు అనుమతివ్వనున్నట్లుగా వారు శుక్రవారం ప్రకటించారు. భక్తులు గమనించి గ్రహణ నియమాలను పాటించాలని కోరారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి: ఎస్పీ



అర్జీలను స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

పలాస: పోలీసు స్టేషన్‌కు వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి చెప్పారు. కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ప్రజా గ్రీవెన్స్‌లో పాల్గొన్నారు. పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని టెక్కలి, కాశీబుగ్గ సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల కోసం కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో ప్రత్యేకంగా ప్రతి శుక్రవారం ఈ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. వీటిని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. అర్జీలను స్వీకరించిన తర్వాత వాటిని స్వయంగా పరిశీలించారు. పెండింగ్ కేసులన్నీ తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటప్పారావు, సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో కళా ఉత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ రవిబాబు, అధికారులు

గార : వమరవల్లి డైట్ కళాశాలలో సెప్టెంబర్ 11, 12 తేదీల్లో జరగనున్న జిల్లా స్థాయి కళా ఉత్సవం పోటీలను విజయవంతం చేయాలని ఇన్‌చార్జి డీఈఓ రవిబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం డైట్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న కళా నైపుణ్యాలు, ప్రతిభా పాటవాలను వెలికి తీయడమే లక్ష్యంగా పోటీలు జరుగుతున్నాయని చెప్పారు. గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, సంప్రదాయ కథలు, దృశ్యకళలు వంటి ఆరు అంశాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన 9, 10, 11, 12 తరగతులకు చెందిన వారు పాల్గొనవచ్చని, ఆసక్తి కలవారు సెప్టెంబర్ 4లోగా 77023 91639 నంబరుకు సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.గౌరిశంకర్, డీవైఈఓ విజయకుమారి, లెక్చరర్లు వెంకటరావు, సీహెచ్ రమణ తదితరులు పాల్గొన్నారు.

బస్సులు లేవు.. రైళ్లు రావు!

- ప్రయాణికులకు నరకయాతన
- ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్లలో గంటల తరబడి పడిగాపులు



సోంపేట రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల నిరీక్షణ

శ్రీకాకుళం అర్బన్/కంచిలి: సరిపడా బస్సులు లేక, సకాలంలో రైళ్లు రాక జిల్లా ప్రయాణికులు శుక్రవారం నరకయాతన అనుభవించారు. విజయనగరం వద్ద గూడ్స్ రైలు ప్రమాదం జరగడంతో అటు విశాఖపట్నం నుంచి వచ్చే రైళ్లు, ఇటు భువనేశ్వర్ నుంచి వచ్చే రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, ఆమదాలవలస తదితర అన్ని బస్‌స్టేషన్‌లతో పాటు జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం కాంప్లెక్స్ కూడా ప్రయాణికులతో రద్దీగా కనిపించింది. దీంతో ఉదయం 9గంటలకు ప్రారంభమైన రద్దీ సాయంత్రం వరకూ కొనసాగింది. వచ్చిన బస్సులు నిండిన వెంటనే వెళ్లిపోవడంతో మిగిలిన ప్రయాణికులు బస్సుల కోసం పడిగాపులు కాశారు. ముఖ్యంగా దూరప్రాంతమైన విశాఖపట్టణం వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. మరోవైపు బరంపురం–విశాఖపట్నం, భువనేశ్వర్–విశాఖపట్నం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేయడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. సోంపేట రైల్వేస్టేషన్‌లో ఉదయం 8.26 గంటలకు వచ్చిన ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ 11.30 గంటల వరకు నిలిచిపోయింది. ఆ రైలు కదిలిన తర్వాత అదే ప్లాట్‌ఫాం మీదకు ఇక్కడ స్టాపేజీ లేని షాలిమర్–వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్ వచ్చింది. ఇది కూడా మధ్యాహ్నం 3 గంటల వరకు నిలిచిపోయింది. ఉదయం 9.20 గంటలకు రావల్సిన కోల్‌కత్తా–చెన్నై మెయిల్ మధ్యాహ్నం 3–50 గంటలకు వచ్చింది. ఇక భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే విశాఖ ఎక్స్‌ప్రెస్ ఉదయం 11.45కి రావల్సి ఉండగా.. సాయంత్రం 4.20 గంటలకు వచ్చిందని సోంపేట రైల్వేస్టేషన్ మేనేజర్ సత్యనారాయణ బెహరా తెలిపారు.



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ఆటో, మ్యాక్సీ డ్రైవర్లను ఆదుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో, మ్యాక్సీ డ్రైవర్లు

రణస్థలం: ఉచిత బస్సు పథకం వల్ల ఉపాధి కోల్పోతున్న ఆటో, మ్యాక్సీ డ్రైవర్లకు భృతి ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూ ఏపీ ఆటో, ట్యాక్సీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.వామనమూర్తి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రణస్థలం రామతీర్థం జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం ధర్నా నిర్వహించి తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు కిరాయి లేక తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఫైనాన్స్ కట్టలేక, అప్పులు తీర్చలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డ్రైవర్లకు భారమైన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, రోడ్ ట్యాక్సీ, టోల్ ఫీజులు 30శాతానికి తగ్గించాలని డిమాండ్ చేశారు. విడి భాగాలపై జీఎస్టీ, వ్యాట్, సెస్ పన్నులు రద్దు చేసి డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. చంద్రబాబు అధికారంలోని వస్తే బ్యాడ్జీ కలిగిన డ్రైవర్లకు సంవత్సరానికి రూ.15వేలు ఆర్థిక సహాయం చేస్తామని, పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, అనారోగ్యంతో చనిపోతే రూ.5లక్షలు, ప్రమాదంలో చనిపోతే 10లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని, వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లైసెన్సు కలిగిన ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏటా రూ.25వేలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కె.శివ, సీఐటీయూ నాయకులు వెలమల రమణ, ఎస్.లక్ష్మణరావు, బి.రామకృష్ణ, బొంతు లక్ష్మణరావు, చిరంజీవి, ఎం.రాముడు, జగదీష్, జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీడీలకు పురస్కారాలు



బహుమతులు అందుకున్న పీడీలతో డీఈఓ, డీవైఈఓలు, అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిభా పురస్కారాలను ఐదు పాఠశాలలకు చెందిన పీడీలు అందుకున్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గత విద్యా సంవత్సరంలో (2024–25) వివిధ క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఐదు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ వేడుకల్లో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అమరావతి వారి ఆదేశాల మేరకు క్రీడాకారుల రాణింపు ఆధారంగా మొదటి ఐదు స్థానాల్లో స్కూల్స్ జాబితాను ఖరారుచేశారు. మొదటి స్థానంలో ఎంజేపీఏపీ శాస్త్రులపేట(244 పాయింట్లు), ద్వితీయ స్థానంలో జెడ్పీహెచ్ స్కూల్ అల్లినగరం (224), తృతీయ స్థానంలో జెడ్పీహెచ్ స్కూల్ ఇప్పిలి (222), నాలుగో స్థానంలో జెడ్పీహెచ్ స్కూల్ పాత్రునివలస (214), ఐదో స్థానంలో జెడ్పీహెచ్ స్కూల్ కేశవరావుపేట (202 పాయింట్లు) నిలిచాయి. వీరికి జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు, ఉప విద్యాధికారులు ఆర్.విజయకుమారి, పి.విలియమ్స్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి బీవీ రమణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొన్న చిన్నారావు అథ్లెటిక్స్ మీట్ వాయిదా

శ్రీకాకుళం న్యూకాలనీ: దివంగత కొన్న చిన్నారావు మెమోరియల్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2025 పోటీలు వాయిదాపడ్డాయి. అల్పపీడన ప్రభావం కారణంగా కురుస్తున్న వర్షాలతో అథ్లెటిక్స్ మీట్ జరగనున్న శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో వర్షపునీరు చేరడం, చిత్తడిగా మారడంతో పోటీల నిర్వహణ సాధ్యపడదని నిర్వాహకులు కొన్న మధుసూదనరావు, ప్రగడ అశోక్ కుమార్, పూడి బాలాదిత్య, అథ్లెటిక్స్ సంఘ ప్రతినిధులు గుర్తించారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో స్పోర్ట్స్‌మీట్‌ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్, జిల్లా చైర్మన్, మీట్ ప్రధాన నిర్వాహకులు కొన్న వెంకటేశ్వరరావు(వాసు), నొపడ విజయ్ కుమార్, మెంటాడ సాంబమూర్తి ప్రకటించారు. తదుపరి అథ్లెటిక్స్ పోటీలు జరగనున్న తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.



ఆకట్టుకున్న హాకీ ఇండియా

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇచ్ఛాపురం మండలం ఈదుపురం కంద్రావార్డు ఉన్నత పాఠశాల విద్యార్థులు ధ్యాన్‌చంద్‌ను స్మరించుకుంటూ హాకీ స్టిక్, ఇండియా ఆకృతిలో ప్రదర్శన నిర్వహించారు. హాకీ క్రీడకే ధ్యాన్‌చంద్ వన్నె తెచ్చారని హెచ్‌ఎం ఉమామహేశ్వరి కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

– ఇచ్ఛాపురం రూరల్